మినీ కథ

# భయం

పుష్యమి

మూర్తి నా చిన్ననాటి స్నేహితుడూ, క్లాసమేటూను. వాడిని కలిసి చాలా కాలమయిం దనుకున్న నేను- మూర్తితో నాలుగు రోజులు సరదాగా గడపాలనుకుని వెళ్ళాను.

మూర్తి ఒక ప్రయివేటు ఫాక్టరీలో డాక్టర్ మంచి పేరుంది మూర్తికి. మూర్తి బలవంతం చెయ్యగా, వాడితోపాటు హాస్పిటల్‌కు వెళ్ళాను.

చురుగ్గా పేషంట్సును చూస్తూ, వాళ్ళు చెప్పుకునే బాధలను వింటూ, శ్రద్ధగా పేషంట్స్‌ని పరీక్షిస్తున్నాడు మూర్తి.

నేను వచ్చే పేషంట్సునీ, వాళ్ళు చెప్పే జబ్బులు వింటూ కూర్చున్న వాడి నల్లా సందేహంగా నిలబడిన ఆవిడను చూసి బయటకు వెళ్ళబోయాను. మూర్తి ఫరవాలేదు...కూర్చోమనడంతో నా ప్రయత్నం విరమించుకున్నాను.

"ఒకసారి బాగా లూజు మోషనయ్యింది. బాగా వికారంగానూ ఉంది." స్వరం తగ్గించి, మూర్తికే వినపడేటట్లు చెప్పింది ఆవిడ.

మూర్తి నవ్వి, మందు రాసిచ్చాడు.



ఆవిడ ఇంకా సంశయంగా నిలబడే ఉంది.

"భయం లేదు. కలరా కాదు." నవ్వుతూ అన్నాడు మూర్తి.

ఆనందంతో ఆవిడ ముఖం వికసించింది.

"అదేమిటి? కలరా కాదంటున్నావు?"

"ఆవిడ తృప్తి కోసం...చెప్పక తప్పదు."

"ఎందుకు?"

"ఈవిడ పేరు సంధ్య. వయస్సు ముప్ఫై సంవత్సరాలు. ఇద్దరు పిల్లలు, భర్తా ఉన్నారు. సంధ్య భర్త చాలా మంచివాడు. ఓర్పు ఎక్కువనే చెప్పాలి. ఇంక సంధ్యకి ఏదో జబ్బు వస్తుందనే భయం పెరిగింది. ఏ చిన్న బాధ కలిగినా వచ్చేస్తుంది. ఒక రోజు భర్తను తీసుకు వచ్చింది. కళ్ళు తిరుగుతున్నా యని చెప్పింది. బి.పి. నార్మల్‌గానే ఉందన్నాను. సంధ్యలో భయం పోలేదు. చెప్పేందుకు సంకోచిస్తోం దని గ్రహించి, ఆమె భర్తని అడిగాను. షుగర్ ఉందని భయమట. సిరసంగా చెప్పి, భార్య భయాలను, అనుమానాలనీ భరించలేకపోతున్నా నని చెప్పాడు. అతన్ని చూస్తే జాలి వేసింది. బ్లడ్ టెస్టు చేయించమని చెప్పాను. ఆ తరవాత రిపోర్టు తీసుకు వచ్చింది. అంతా నార్మల్‌గా ఉందనేసరికి, మొహంలో కాంతి వచ్చింది."

"ఆవిడకు ఏ అనారోగ్యమూ లేదా?"

"ఆవిడకు గ్యాస్ట్రిక్ ట్రబుల్ ఉంది. సంధ్యకు నమ్మకం లేదు. అనుమానం ఎలా ఉంటుందంటే కుడి వైపు కడుపులో నెప్పనిపిస్తే అపెండిసెటిస్, యూరిన్ ఎల్లో కలర్‌లో ఉంటే జాండీస్ నని భయం. కడుపులో మండితే అల్సరని భయం. గుండె నెప్పనిపిస్తే గుండె జబ్బు. సంధ్య అనుమానాలను దూరం చేసేందుకు స్పెషలిస్టుల దగ్గరకు పంపక తప్పలేదు."

"భయానికి ఏదో కారణం ఉండాలి."

"ఉంది. ఆమె భర్త చెప్పాడు."

"ఏమి టది?"

"తన పిల్లలకు సవితల్లి వస్తుందేమో నని భయం."

"ఆఁ...!"